ప్రజాశక్తి

మంగళవారం 9 జనవరి 2024   8 పేజీలు



గుంటూరు



పల్నాడు



గుంటూరులో ప్రదర్శన చేస్తున్న కార్మికులు

స్పందించకుంటే సమ్మె ఉధృతం

మున్సిపల్ కార్మికుల ప్రదర్శన, కలెక్టరేట్ ఎదుట ధర్నా - 14వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు



పల్నాడు కలెక్టరేట్ ఎదుట బైటాయించిన కార్మికులు

మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచే వరకు సమ్మె కొనసాగిస్తామని, ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే అత్యవసర సేవలూ నిలిపివేసి మరింత ఉధృతం చేస్తామని గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు అన్నారు. మున్సిపల్ కార్మికుల 14వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా తొలుత జిఎంసి ప్రధాన కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకూ ▶ 2లో

అదరం.. బెదరం..

28వ రోజూ ఉధృతంగా అంగన్‌వాడీల సమ్మె - ఎస్మా ప్రయోగంపై ఆగ్రహం

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

ప్రభుత్వం ఎస్మా ఉత్తర్వులిచ్చినా అంగన్‌వాడీలు తగ్గేది లేదంటున్నారు. సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగించి తీరుతామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర అధ్యక్షులు చిన్న వెంకాయమ్మ అధ్యక్షత వహించారు. సోమవారం నుండి చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ నాయకులు నాగమణి, యశోధ, రాజేశ్వరి, సంధ్యారాణి కూర్చున్నారు. దీక్షలకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి పాల్గొని మద్దతు తెలిపారు. ముజఫర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వకుండా, ఉద్యోగులుగా గుర్తించకుండా వారిపై ఎస్మా ప్రయోగించటం విడ్డూరంగా ఉందన్నారు. అంగన్‌వాడీలను విస్మరిస్తే ఓటమి తప్పదని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు అండగా అన్ని కార్మిక సంఘాలు ఉద్యమించటానికి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఓబులేసు మాట్లాడుతూ సమ్మెకు ముందు న్యాయబద్ధంగా ప్రభుత్వానికి సమస్యలు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో ఓట్లు పొందటానికి హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయట్లేదన్నారు. దేశ వ్యాప్తంగా కనీస వేతనం రూ.26 వేలు అడుగుతుంటే ఎపిలో మాత్రం ఇచ్చిన హామీలు కూడా అమలు చేయట్లేదన్నారు. ప్రతినెలా సంక్షేమ కార్యక్రమాలకు బటన్ నొక్కే కార్యక్రమాల ▶ 2లో



గుంటూరు, నరసరావుపేట సమ్మె శిబిరాల్లో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్, సిహెచ్ ఎల్.ఎన్ మూర్తి



తాడేపల్లిలో తన అనుచరులతో ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

4వ పేజీ

పేటలో సిట్టింగుకే మళ్లీ అవకాశం

నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యే, అసమ్మతి గ్రూపులతో సమావేశమైన అధిష్టానం

ప్రతిఏటా నష్టాల వేట..

- ఏదో ఒక కారణంతో దెబ్బతింటున్న రైతులు - పెట్టుబడులైనా రాని దైన్యం
- నష్టపరిహారం నమోదు, ఆదుకోవడంలోనూ అన్యాయం

వాణిజ్య పంటలు, అపరాల పంటలు, సిరి ధాన్యాలు మొక్కజొన్న, సెనగ ఇలా ఏ పంటలు సాగు చేసిన రైతులను కదిలించినా నష్టాలను తలుచుకొని నిట్టూరుస్తున్నారు. సరైన వర్షాల్లేక ఒకేడాది.. నకిలీ విత్తనాలతో మరో ఏడాది.. తెగుళ్లతో ఇంకో ఏడాది ఇలా ప్రతి ఏడాది మిర్చి, పత్తి రైతులు దెబ్బతింటూనే ఉన్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి చివరకు నష్టాలు మూటగట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గతేడాది రబీలో ఆరుతడి పంటలకే నీరు ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో రైతులు అందుకు అనుగుణంగానే పంటలేశారు. అయినా నీరు సరిగా రాకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేసి మిర్చి పంటను కాపాడుకున్నారు. అయితే డిసెంబర్‌లో మిచౌంగ్ తుపాను వచ్చియ పంటను దెబ్బతీసింది. అయితే వివిధ రకాల నిబంధనల పేరుతో 35 శాతంపైగా పంట దెబ్బతిన్న పొలాలనే అధికారులు నమోదు చేశారని, పరిమిత సంఖ్యలో రైతులే అర్హత సాధించారని రైతులంటున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి తీరా పంట చేతికి వచ్చే సమయంలో పూత పిందే రాలిపోవడం, ఎన్ని మందులు కొట్టినా పరిస్థితుల మార్పు రాకపోవడంతో కొంతమంది మిర్చి రైతులు సాగు చేసిన తోటలను దున్నివేశారు.

నకిలీ విత్తనాలతో పైరు ఎదగకుండా ▶ 2లో





దెబ్బతిన్న మినుము పైరు.. నకిలీ కావడంతో ఎదుగుదల లేని మిర్చి పైరు (ఇన్‌సెట్)

సిపిఎం నాయకులు కోటిరెడ్డి కుమార్తె సింధు మృతి



నేడు తాడేపల్లిలో అంత్యక్రియలు

వార్త మెయిన్‌లో

బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమాన విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు సోమవారం తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గుంటూరు శివారు నల్లపాడులోని ఒక కాలనీకి చెందిన కొండా దినేష్ భార్య నుండి విడిపోయి తల్లితో ఉంటున్నాడు. 2022 సెంప్టెంబర్ 10న సాయంత్రం కాలనీలో తన ఇంటి ముందు ఆటలాడుకుంటున్న ఆరేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి, ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక కోసం వెతుకుతున్న తల్లితోపాటు, ఇతరులు ఆ బాలిక దినేష్ ఇంటి నుండి బయటకు రావటం గమనించారు. వెంటనే ఆ బాలికను పరీక్షించగా ఒంటిపై గాయాలున్నాయి. దినేష్‌పై నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతన్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. దర్యాప్తు ▶ 2లో



సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ కుడికాల్వకు సోమవారం నీటిని విడుదల చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు సభ్యులు అజయ్ కుమార్‌గుప్తా పర్యవేక్షణలో కుడికాల్వ 5, 7వ గేట్ల ద్వారా గేటుకు 2,500 క్యూసెక్కుల చొప్పున రెండు గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులను నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ మురళీధర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం 5 టిఎంసీలను రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణానది యాజమాన్య బోర్డు ఇఇలు రఘునందన్‌రావు, శివశంకర్, లింగంగుంట్ల సర్కిల్ ఎస్ఇ వరలక్ష్మి, సాగర్ ప్రాజెక్టు ఇఇ శ్రీహరి, డీఈలు మురళీధర్, వెంకటసుబ్బయ్య, జేఈలు బాబుమియా, భారతి పాల్గొన్నారు.

స్పందించకుంటే సమ్మె ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శన చేశారు. అనంతరం కలెక్టరేట్ గేటు ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. కార్మిక ప్రదర్శనలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు జిల్లాలోని వివిధ మున్సిపాల్టీల నుండి మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయమని అడుగుతున్నామని, కొత్త కోర్కెలు కోరట్లేదని అన్నారు. జీతాలు పెంచాలని కోరుతుంటే మంత్రుల బృందం 2022లో పెంచామని, మళ్లీ రెండేళ్లలోనే పెంచుతామా అని అంటున్నారని అన్నారు. ఈ ప్రభుత్వమే ధరలు అమాంతం పెంచిందని, ట్రూ అప్, సర్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపిందని, ఆర్టీసీ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాచూరి వేణు, సిఐటియు రాజధాని ఏరియా అధ్యక్షులు ఎం.రవి, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, కె.వెంగమ్మ, తెనాలి పట్టణ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఛార్జిషీటు దాఖలు చేశారు. నేరాన్ని ప్రాసిక్యూషన్ రుజువు చేయటంతో దినేష్‌కు 20 ఏళ్ల జైలు, రూ.3500 జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బాలికకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్యామల ప్రాసిక్యూషన్ నిర్వహించగా, డీఎస్పీ జెస్సీ ప్రశాంతి దర్యాప్తు చేశారు.



బహుమతులు అందజేస్తున్న ఖాశీం

ఉర్దూ పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి–తాడేపల్లి : తాడేపల్లి నులకపేటలోని ఎంపియుపిఎస్ ఉర్దూ పాఠశాలను గుంటూరు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉర్దూ రేంజ్ ఎంపి ఖాశీం సోమవారం తనిఖీ చేశారు. 5, 6, 7 తరగతుల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన స్కూల్ లెవల్ కాంపిటేషన్ పేపర్లను పరిశీలించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. 3, 4, 5 తరగతులకు చెందిన వంద మంది విద్యార్థులకు నోటుపుస్తకం, పెన్సిల్ అందించి కాలిగ్రఫీ తరగతులును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అబ్దుల్ షాజీర్, ఎం.రవిబాబు, కె.అన్నపూర్ణలను అభినందించారు.

రైల్వే ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి–తెనాలిరూరల్ : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెనాలి సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేశారు. యూనియన్ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, సెక్రటరీ సయ్యద్ బాజీ హుస్సేన్ మాట్లాడుతూ 2004 నుంచి రద్దయిన పెన్షన్ విధానం కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ విధానంలేకుండా చేసిందన్నారు. లక్షలాది మంది రైల్వే ఉద్యోగులు కొత్త పెన్షన్ విధానాన్ని నిరసిస్తున్నట్లు తెలిపారు. అనేక ఉద్యమాలు చేసినా కేంద్రప్రభుత్వం దయచూపకపోవడం శోచనీయమని యూనియన్ సెక్రటరీ బాజీ హుస్సేన్ అన్నారు. కేంద్రం ఇప్పటికైనా కళ్ళుతెరచి కొత్త పెన్షన్ విధానాన్ని అమలుపర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ యూత్ సెక్రటరీ ఎల్.సాయి కుమార్, బి.రామస్వామి, జె.రాంబాబు, కె.రాజేష్ పాల్గొన్నారు.

వేధింపులు.. మోసాలు.. కబ్జాలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన విచారణ చేపట్టి న్యాయం చేయాలని పోలీసు అధికారులను పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఉద్యోగాల పేరిట, చిట్స్ మోసాలు, ఆన్లైన్ ద్వారా నగదు అపహరణ, కుటుంబ, ఆర్థిక పరమైన మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్‌కె చంద్రశేఖర్, డీఎస్పీలు కెవి మహేష్, బి.ఆదినారాయణ, పల్లపు రాజుగారు, యు.రవిచంద్ర, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వదిలించుకోవాలని చూస్తున్న భర్త

మండల కేంద్రం నకరికల్లుకు చెందిన అనిల్‌ను గతేడాది వివాహం చేసుకున్నానని, పెళ్లికి మధ్యవర్తిగా వ్యవహరించిన మహిళతోనే ఆయన వివాహేతర సంబంధం పెట్టుకొని ఇప్పుడు తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేశారు. పెళ్లయిన దగ్గర్నుండి అనేక రకాలుగా వేధింపులకు గురిచేసి అదనపు కట్నం కోసం ఇబ్బందులు పెడుతున్నారని, వేధింపులు తాళలేక ప్రస్తుతం బాపట్ల జిల్లా చీరాల మండలం కేశవరప్పాడులో తల్లిదండ్రుల వద్ద ఆశ్రయం పొందుతున్నానని వాపోయారు.

ఉద్యోగం పేరిట రూ.14 లక్షల మోసం

పాఠశాల ప్రిన్సిపాల్, ఆమె భర్త కలిసి తనకు ఉద్యోగం ఇప్పిస్తామని రూ.14 లక్షల తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అచ్చంపేట మండలం పెదపాలేనికి చెందిన నయావత్ మురళి కృష్ణా నాయక్ ఫిర్యాదు చేశారు. వారిని డబ్బులు అడుగుతుంటే చంపుతానని బెదిరిస్తున్నారని, అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

కొడుకు చేసిన అప్పుపై తల్లికి వేధింపులు



తరతరాలుగా అనుభవిస్తున్న ఇంటిని భర్త మరణాంతరం కొడుకు పేరిట రాశానని, ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు విశ్వనాథ్ నరసరావుపేటలోని ఇంటిపై శ్రీరామ్ ఫైనాన్స్‌లో రూ.13 లక్షలు అప్పుగా తీసుకొని చెల్లించకపోవడంతో ఫైనాన్స్ అధికారులు ఇంటిపైకి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని నరసరావుపేట పట్టణం వరవకట్ట ప్రాంతానికి చెందిన చల్లా చెంచమ్మ ఫిర్యాదు చేశారు. కుమారుడితో మాట్లాడి అప్పు తీర్చేలా చేయాలని, అప్పటివరకు శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులు తనను ఒత్తిడి చేయకుండా చూడాలని వేడుకున్నారు.

అప్పు చెల్లించినా బంగారం ఇవ్వడం లేదు



చిలకలూరిపేట పట్టణంలోని బంగారం వ్యాపారి నాగ ప్రకాశరావు వద్ద బంగారు ఆభరణాలు తనఖా పెట్టి రూ.6 లక్షల తీసుకున్నానని, అనుకున్న సమయానికి వడ్డీసహా చెల్లించినా బంగారు ఆభరణాలను వ్యాపారి ఇవ్వడం లేదని బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన రమావత్ సూర్య నాయక్ ఫిర్యాదు చేశారు. దీనిపై చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని చెప్పారు.

భూమిని బంధువే ఆక్రమించి అమ్మాడు



పొలాన్ని సమీప బంధువు కోలా శ్రీను ఆక్రమించి ఇతరులకు విక్రయించాడని, 6.47 సెంట్ల భూమికి సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, ప్రశ్నిస్తే దాడి చేశాడని దీనిపై వినుకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదని వినుకొండ మండలం కొప్పుకొండకు చెందిన మంద కొండయ్య ఫిర్యాదు చేశారు.

వైసిపి కౌన్సిలర్‌పై కబ్జా ఫిర్యాదు



వినుకొండ పట్టణం స్లీపర్స్ కాలనీకి చెందిన వైసిపి వార్డ్ కౌన్సిలర్ హేమ గతంలో రెండు అడుగుల స్థలాన్ని ఆక్రమించారని, దీనిపై గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానాయుడుకు ఫిర్యాదు చేయటాన్ని ఓర్చుకోలేక ఏకంగా 45 ఏళ్లుగా కాలనీవాసులు వినియోగించుకుంటున్న రోడ్డు మార్గాన్ని 9 అడుగుల మేర ఆక్రమించారని అదే కాలనీకి చెందిన వేల్పుల శ్యాం కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రశ్నించినందుకు కాలనీ వాసులను దుర్భాషలాడారని, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా అధికార పార్టీ కావడంతో పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారని వాపోయారు.

అదరం.. బెదరం..

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో రూ.లక్షలు వృథా అవుతున్నాయని, ఆ వృథాను అరికడితే అంగన్‌వాడీలకు జీతాలు పెంచొచ్చని అన్నారు. సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఎస్మాకు బెదరకుండా తాడో పేడో తేల్చేకోవాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు అండగా ఉన్నాయని చెప్పారు. గతంలో తమిళనాడులో 76 వేల మంది ఉద్యోగులపై ఎస్మా ప్రయో గిస్తే పెద్ద ఎత్తున వ్యతిరేకత రావటంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పార్కు రోడ్డులో ధర్నా శిబిరం కొనసాగుతోంది. బారెడు చాకిరికి బెత్తెడు వేతనంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన దీక్షలు 3వ రోజుకు చేరాయి. సమ్మె శిబిరాన్ని ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది సిహెచ్ ఎల్ఎన్ మూర్తి, నరసరావుపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బి.సలీం, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సుందరయ్య, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బి.బాబురావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీను, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, జై భీమ్ భారత్ పార్టీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.జాన్‌పాల్, ఇతర ప్రజా సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సిహెచ్ఎల్ఎన్ మూర్తి, బి.సలీం మాట్లాడుతూ ఎస్మా ద్వారా అంగన్వాడీలను భయపెట్టి సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ఎస్మా చట్టం అసలు వర్తించదని అన్నారు. చట్టబద్ధంగా పోరాడుతున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి వైసిపి ప్రభుత్వం తన భయాన్ని బయట పెట్టుకుందని విమర్శించారు. ఎస్మా చట్టాన్ని తక్షణమే ఎత్తివేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళ సంక్షేమం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీలు మహిళలనే విషయాన్ని మరిచిపోయారా? అని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18 వేలు వేతనం అమలుకు సన్నాహాలు చేస్తోందని, అది చూసైనా ఇక్కడి సిఎం మారాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి, వివిధ సంఘాల నాయకులు షేక్ సిలార్ మసూద్, డి.శివకుమారి, కవిత, మాధవి, సాయి, నిర్మల, విజయలక్ష్మి అంగన్వాడీలు పాల్గొన్నారు.





గుంటూరు సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు.. నరసరావుపేట శిబిరంలో దీక్షలను ప్రారంభిస్తున్న డి.శివకుమారి

ప్రతిపటా నష్టాల వేట..

(మొదటి పేజీ తరువాయి)

పూత పిందె రాలిపోతూ ఆకుల ముడతపడి ఎదుగుదల లేకుండా పొలాలు ఉన్నాయని కొంతమంది రైతులు చెబుతున్నారు. వేల రూపాయలు వెచ్చించి పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేదని కొంత మంది అంటున్నారు. పురుగు మందుల కొనుగోళ్లలో కూడా రైతులు మోసపోతూనే ఉన్నారు. నిషేధిత బయో ఉత్పత్తులను చాటుమాటుగా రైతులకు అంటగాడుతూ ఈ రూపంలో కూడా రైతులను దోపిడీ చేస్తున్నారు.

రెండెకరాల మిర్చిని దున్నేశా

టి.వీరాంజనేయులు, కౌలురైతు, అన్నవరం, రొంపిచర్ల మండలం.



మూడెకరాల్లో మిర్చి, రెండెకరాల్లో పొగాకు సాగు చేపడితే ఇప్పటివరకు రూ.5 లక్షల పెట్టుబడులయ్యాయి. మిచౌంగ్ తుపాను వల్ల రెండెకరాల్లో మిర్చి పూర్తిగా దెబ్బతినడంతో దున్నివేసి మొక్కజొన్న సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాను. మిగిలిన ఎకరం మిర్చి తోటకు బొబ్బర తెగులు, తామర పురుగు సోకింది. కౌలు రైతుల వ్యవసాయం చేయలేని పరిస్థితి ఎదురవుతోంది.

నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయా

చెన్నంశెట్టి సాంబశివరావు, కౌలురైతు, కట్టుబడివారిపాలెం, చిలకలూరిపేట మండలం.



కొనుగోలు చేసిన విత్తనాలు నకిలీవి కావడంతో పూత దశలోనే పంట ఎదుగుదల నిలిచిపోయింది. పూత రాలిపోవడం పిందె దశలోనే కాయ ఎండిపోవడం గమనించి విత్తన దుకాణ యజమాని ప్రశ్నించగా కంపెనీ ప్రతినిధులు వచ్చి పరిశీలిస్తారని చెబుతూ జాప్యం చేస్తున్నారు. కొంతైనా దిగుబడి వస్తుందేమో అన్న ఆశతో వేలాది రూపాయలు ఖర్చు చేసి అనేక రకాల మందులు పిచికారి చేశా. అయినా ఫలితం లేకపోవడంతో తోటను దున్నేసేందుకు ప్రయత్నం చేస్తున్నా. వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి పొలాన్ని పరిశీలించలేదు. నష్ట పరిహారం నమోదు చేయలేదు. రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు.

మినుమేసి రూ.30 వేలు నష్టపోయా

గట్టుపల్లి షేకలి, రైతు, రొంపిచర్ల మండలం.



రెండెకరాల్లో మినిము సాగు చేశారు. పురుగు ఎక్కువగా ఉండటంతో అనేకమార్లు పురుగు మందులు పిచికారీ చేశా. పురుగు, తెగుళ్ల నివారణకు తోట మెత్తదనం రావడం కోసం పిచికారీ చేసిన మందులతో పైరు గిడసబారి పూత పిందె రాలేదు. రూ.30 వేల నష్టం వచ్చింది. పైరును దున్ని పశువుల మేత అయిన సాగు చేద్దామంటే అసలు నీరే లేపోవడంతో ఊరుకున్నా

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల్ని విలీనం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ సంస్థలో విలీనం చేసి డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని, పీస్ రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలిడేస్ తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక సంగడిగుంటలోని విద్యుత్ భవన్ వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందరంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జల్లడ రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముజఫర్ అహ్మద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, పల్నాడు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికీ నాలుగున్నర సంవత్సరాలు గడిచినా హామీ హామీగానే ఉందన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ రద్దుచేసి నేరుగా జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలు జరపలేదని అన్నారు. పదేపదే డైరెక్ట్ పేమెంట్ గురించి కార్మికులు అడుగుతున్నా యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు. గత 5 ఏళ్లుగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ సీపీడీసీఎల్ పరిధిలో పెయిడ్ హాలిడేస్ పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పిఆర్సీ ఇస్తున్న సమయంలో జీతాలు పెంచాల్సి ఉండగా, ప్రస్తుత పిఆర్సిని వదిలేసి, పాత పిఆర్సీ జీతాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వటం తీవ్ర అన్యాయం అన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్లు ఉద్యోగ భద్రత ప్రమాదంలో ఉందన్నారు. పీస్‌రేట్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత ఇవ్వాలని, ప్రతి సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌ని నియమించాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ షిఫ్ట్ ఆపరేటర్లందరికీ ఒకే వేతనం ఇవ్వాలని పాత కొత్త తేడా లేకుండా అందరికీ ఒకే వేతనాలు గతంలో లాగే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డి.ఈ టెక్నికల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి పవన్ ,జి నాగరాజు, కోశాధికారి కే రాంబాబు, సుబ్బారెడ్డి, నాయకులు వర్మ, రవి, నాగరాజు, వెంకట్రావు, భరత్, భాష తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

నాయకులతో కమిషనర్ చర్చలు

ప్రజాశక్తి తెనాలి :సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 14వ రోజుకు చేరింది. సమ్మె కారణంగా పట్టణంలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఎం జస్వంత్ రావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో సోమవారం చర్చలు జరిపారు. సమ్మె విరమించి విధులలోకి రావాలని కోరారు . ఈ సందర్భంగా చర్చలలో పాల్గొన్న యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్ అయిన కార్మికునికి గ్రాట్యుటీ చెల్లించి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని తదితర అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు సమ్మె విరమించేది లేదని చెప్పినటు తెలిపారు.

రమీ బేగంకు ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆంధ్రప్రదేశ్ చరిత్ర 46వ వార్షిక సమావేశాలు, విశాఖ పట్నంలోని లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఈనెల 6,7లలో జరిగాయి. దక్షిణ భారత దేశం నుండి 170 మంది చరిత్ర కారులు. పాల్గొన్నారు. ఈ సమావేశంలో గత ఏడాది కడపలోనీ యోగి వేమన విశ్వ విద్యాలయంలో జరిగిన 45వ వార్షిక సమావేశంలో సమర్పించిన పరిశోధనా పత్రాలలో, ఉత్తమ పరిశోధనలకు ఇచ్చిన నగదు పురస్కారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చరిత్ర - పురావస్తు విభాగానికి చెందిన అద్యాపకురాలు డాక్టర్ షేక్ రమీ బేగం పొందారు. ఆమె సమర్పించిన పరిశోధన పత్రం “ జైన మాన్యు మెంట్స్ ఇన్ కడప డిస్ట్రిక్ట్” కు లభించింది. ఈ సందర్భంగా విశ్వవి ద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ అభినందనలు తెలియ చేశారు. రానున్న రోజుల్లో ఇంకా ఉత్తమమైన పరిశోధనలు చేయాలని ప్రోత్సహించారు. ఈ సంద్భంలో డిపార్టుమెంట్ హెడ్ ఈ. వి .పద్మజ, ప్రొఫెసర్ మురళీ మోహన్ , తది తరులు రమీ బేగం కు అభినందనలు తెలియజేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గంగాధర్‌రావు


ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు లయన్స్ క్లబ్ సిటిజన్స్ క్లబ్బునూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం స్థానిక పొన్నూరు లయన్స్ క్లబ్ నందు గవర్నర్ మేళం కృపానందం సమక్షంలో నిర్వహించ జరిగింది. క్లబ్ నూతన అధ్యక్షునిగా గూడవల్లి గంగాధరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గంలో కార్యదర్శిగా అద్దేపల్లి రవీంద్ర కుమార్, కోశాధికారిగా తాడికొండ వరప్రసాద్ , ఉపఅధ్యక్షులుగా షేక్ మస్తాన్ , పి శ్రీకాంత్ క్లబ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది . నూతన వర్గ కార్యవర్గ నికి ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ కి నోట్ బుక్స్ లు వద్దులకు దుప్పట్లు పంపిణీ జరిగినది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన జి. గంగాధర్ మాట్లాడుతూ క్లబ్ సేవలు అందించడంలో శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కోట శ్రీనివాసరావు విజయ కుమార్ రెడ్డి బాలస్వామి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వల్లంశెట్టి శ్రీధర్ కే దుర్గారాణి యానాది రావు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక గ్రామంలో అనారోగ్యంతో చనిపోయిన చింతగుంట్ల ఏబుకు టిడిపి మండల కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షులు వీరేంద్రనాథ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.నాగార్జున, మాణిక్యం, కె.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగులను మోసం చేశారు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేసి జాబ్ క్యాలెండర్- 2024 విడుదల ,మెగా డిఎస్సి నిర్వహణ,గ్రూప్ 1,2 అభ్యర్థుల వయోపరిమితి పెంపు, రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ, పరిశ్రమలు స్థాపన,పెట్టుబడుల ఆకర్షణ ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పన వంటి హామీలు అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ ఆధ్వర్యంలోసోమవారం నిరసన ప్రదర్శన జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రావిపాటి సాయి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల హామీలలో భాగంగా రాష్ట్రంలో వివిధ శాఖల్లో 2.36 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి అధికారంలో రాగానే అన్ని భర్తీ చేస్తామని చెప్పారు. అలాగే ప్రతిఏటా మెగా డిఎస్సి నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఉద్యోగాల విప్లవం తీసుకొస్తామన్న ముఖ్యమంత్రి ఆ ఊసే ఎత్తని పరిస్థితి ఉందన్నారు. నిరుద్యోగ రేటులో ఎపి ప్రధమ స్థానంలో ఉండటం బాధాకరం అన్నారు. రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ 2019-2023 వరకు ప్రభుత్వం చేసిన నోటోఫికేషన్ల జాప్యం వలన ఎంతోమంది వయోపరిమితి కోల్పోయారు వయోపరిమితి కోల్పోయిన అభ్యర్థులకు 42 ఏళ్ల నుండి 44 ఏళ్లకు పెంచి సడలింపును ఇస్తూ ఆదుకోవాలన్నారు.ఉద్యోగ భద్రత లేక మరియు మత్తు పదార్థాలకు బానిసలయ్యి గడచిన 4 ఏళ్లలో వేలమంది బలవన్మరణాలకు ఆరోగ్యాలు పాడయ్యి 21,575 మంది అసువులు బాసారు. ఇకనుండయినా నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆపాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నకరికల్లు

బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లి క్రషర్ వద్ద కారంపూడి వైపు వెళుతున్న బొలోరో వాహన కమాన్ కట్టలు విరగడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని అదుపుతప్పి ఢీ కొట్టింది. వాహనంపై ఉన్న కాళంగి పాండురంగ విట్టల్ , నిడికొండ మల్లికార్జున రావుకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో నరసరావుపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్ :పెదనందిపాడు మండలం అన్నపర్రులో యువతి సోమవారం ఉరేసుకొని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన కనపర్తి కేజియాకి అన్నపరు గ్రామానికి చెందిన రాజుపాలెం సాంబయ్యకు గత మూడు సంవత్సరముల నుండి సోషల్‌మీడియా పరిచయం ద్వారా ప్రేమగా మారి ఇరువురి పెద్దల సమక్షంలో మూడు నెలల క్రితం వివాహం చేసుకు న్నారు. అయితే వివాహం జరిగిన కొద్ది రోజులకే భార్యాభర్తల మధ్య గొడవలు రావడం దీనికి తోడు అత్త మామ బంధువుల వేధింపులతో బాధపడుతున్నట్లు మృతురాలి తల్లి కనపర్తి కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తన కుమార్తె కేజియా మృతిపై తనకు అనుమానముగా ఉన్నదని తనకు న్యాయం చేయవలసినదిగా పెదనందిపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ దర్యాప్తు చేస్తున్నారు. శవపరీక్ష నిమిత్తము మృతదేహాన్ని బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ధరఖాస్తుకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిగ్రీ అధ్యాపక ఉద్యోగాలకు సెట్ లేని వారికి దరఖాస్తుకు అవకాశం కల్పించాలని అధ్యాపక ఉద్యోగ సాధన సమితి సమన్వయకర్త ద్రవిడ సురేష్ , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మందగళ్ళ సాయి కుమార్ లు కోరారు. సోమవారం మంగళగిరి లోని కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ గారికి వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు , విద్య ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖలోని డిగ్రీ అధ్యాపక ఉద్యోగాల భర్తీ చేయుటకు ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. ఈ నెల 24 నుండి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం అవుతుందని అయితే ఈ అధ్యాపక ఉద్యోగాలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ)తోపాటు రాష్ట్ర అర్హత పరీక్ష లేదా జాతీయ అర్హత పరీక్ష లేదా పీహెచ్డీ లు విద్యార్హతగా ఉన్నాయని తెలిపారు. అధ్యాపక వృత్తి ని ఎంచుకునేందుకు పీజీ పూర్తి చేసిన వారి ఆశలు నిరాశలు కాకుండా ఉండేందుకు సెట్ అర్హత లేని వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.


21వ డివిజన్‌లో పర్యటిస్తున్న మంత్రి విడదల రజిని

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించాం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని మంత్రి విడుదల రజినితెలిపారు. పేదవారికి వైద్య సేవలు ప్రతి ఇంటి ముంగిటకు తీసుకెళ్లిన ఘనత తమదేనని చెప్పారు. గుంటూరులోని 21వ డివిజన్ లో సోమవారం ఆమె పర్యటించారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే అనుచరులు

పేటలో సిట్టింగుకే మళ్లీ అవకాశం

నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యే, అసమ్మతి గ్రూపులతో సమావేశమైన అధిష్టానం

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరిగి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి కేటాయించినట్లు వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి చెప్పినట్లు తెలిసింది. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గ్రూపు, నియోజకవర్గంలోని వైసిపి అసమ్మతి నేతలతో విజయసాయిరెడ్డి విడివిడిగా సమావేశమయ్యారు. ముందుగా ఆయన అసమ్మతినేతలతో మాట్లాడి నరసరావుపేట సీటును శ్రీనివాసరెడ్డికే కేటాయిస్తున్నామని, ఆయన విజయానికి సహకరించాలని చెప్పారు. అయితే ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై ఆలోచించేందుకు అసమ్మతి గ్రూపు కొంత సమయం అడిగినట్లు తెలిసింది. అనంతరం ఎమ్మెల్యే గ్రూపుతో సమావేశమయ్యారు. అసమ్మతి నేతలను కలుపుకొని వెళ్లాలని, వారితో చర్చలు జరిపి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని చెప్పారు. అనంతరం సిఎం క్యాంపు కార్యాలయం నుంచి బయటికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా తిరిగి పోటీ చేయబోతున్నట్టు ప్రకటించారు. రెండ్రోజుల్లో పార్టీ అధినాయకత్వం ఈ విషయాన్ని ప్రకటించే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో కొంత అసంతృప్తి ఉన్నమాట వాస్తవమని, వారిని కూడా కలుపుకుపోయి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు.



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని దమ్మాలపాడు జెడ్‌పి పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను గ్రామానికి చెందిన దాతలు ఈపూరి సాంబిరెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ జి.మిరియమ్మ, యుటిఎఫ్ మండల భాద్యులు దేవరాజ్, శ్రీవర్ధిని, రంగారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహుకరించిన యుటిఎఫ్ సీనియర్ నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.నాగేంద్రుడు ఈపూరు మండలం బోడిచెంబులవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలతో బీరువాను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మస్తాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి యుటిఎఫ్ ఎప్పుడు ముందుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జి.నాగలక్ష్మి, యుటిఎఫ్ పల్నాడు జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.ఎ. జిలాని, ఈపూరు మండలశాఖ కమిటీ బాధ్యులు జి.రామారావు పాల్గొన్నారు.

జైలుకైనా వెళ్తాం.. వెనక్కు మాత్రం తగ్గం..







ప్రజాశక్తి - చిలకలూరిపేట

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజుకు చేరింది. స్థానిక గ్రంథాలయం వద్ద సమ్మె శిబిరంలో కళ్లు, చెవులు, నోరు మూసుకుని నిరసన తెలిపారు. శిబిరంలో రిలే దీక్షలు చేపట్టగా పలువురు అంగన్వాడీలకు యూనియన్ సెక్టార్ అధ్యక్షులు జి.సావిత్రి దండలేసి ప్రారంభించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లీశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించినంత మాత్రాన వెనక్కు తగ్గుతారని అనుకోవడం పొరపాటన్నారు. ప్రభుత్వం దిగొచ్చేదాకా సమ్మె జరుగుతుందని స్పష్టం చేశారు. సమ్మెకు మద్దతుగా కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే కార్మిక, కర్షిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో జైలుభరో నిర్వహిస్తామని చెప్పారు. సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, ఎఐటియుసి నాయకులు వరహాలు, ఐద్వా నాయకులు సిహెచ్ నిర్మల, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక సురేష్ మహల్ రోడ్డులో అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరం 28వ రోజు కొనసాగింది. నిరసనలో భాగంగా సోమవారం పడుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమమీద బ్రహ్మాస్త్రంలా ఎస్మాను ప్రయోగించినట్లు ప్రభుత్వం చెప్పిందని, అయితే దానికి తామేమీ భయపడకపోవడంతో మరో అస్త్రంగా అధికారులను ఉసిగొల్పి బెదిరించడం ద్వారా విధుల్లో చేరేలా ఒత్తిడి చేస్తోందని విమర్శించారు. అంగన్వాడీలు నిత్యం ఇలా కష్టనష్టాలతోనే బతకాలని ప్రభుత్వం కోరుకుంటోందని, అందుకే తమ సమస్యలను విస్మరిస్తోందని మండిపడ్డారు. అనంతరం ఎస్మా చట్టం గురించి సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, నాయకులు ఆంజనేయులు, న్యాయవాది మూర్తి వివరించారు. అంగన్వాడీలు భయపడాల్సిందేమీ లేదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎఎల్. ప్రసన్నకుమారి, ఎం.శారమ్మ, మున్ని, విజయకుమారి, ఏసు, మాణిక్యం, శ్రీదేవి, హరిత, కష్ణకుమారి, శారద, నాగజ్యోతి, బీబీ, ఉమాశంకరి, ప్రసూనాంబ, జి.పద్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద సమ్మె శిబిరంలో దండాలు పెడుతూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతురెడ్డి, మండల నాయకులు ఎం.దేవసహాయం మాట్లాడారు.

ప్రజాశక్తి - మాచర్ల

సమ్మెలో భాగంగా శిబిరంలో తెలుగుతల్లి వేషధారికి వినతిపత్రం ఇస్తూ మా మొర అలకించాలని అంగన్వాడీలు వేడుకున్నారు. దీంతోపాటు తెలుగుతల్లి వేషధారి పక్కన తాము సంకెళ్లకు భయపడబోమంటూ పిడికెళ్లు బిగించారు. జైళ్లకైనా వెళ్తామని ఉద్ఘాటించారు. నాయకులు ఉషారాణి, ఇందిర, కె.పద్మావతి, శాంతలత, కోటేశ్వరి, సుందరలీల, శారద, దుర్గా శివలక్ష్మి, రుక్మిణి, జయలక్ష్మి, శివపార్వతీ, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సమ్మె శిబిరంలో 24 గంటల నిరాహార దీక్షలు చేపట్టారు. అంగన్వాడీలు డప్పు కొట్టి వినూత్న రీతిలో నిరసన తెలపగా దీన్ని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు దుగ్గి నాగేశ్వరరావు డప్పు కొట్టి ప్రారంభించారు. దీక్షలకు సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్ మద్దతు తెలిపారు. జి.సుజాత, ఎం.అహల్య, ధనలక్ష్మి, చాముండేశ్వరి, అంజలి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. సిఐటియు, ఎఐటియుసి నాయకులు బి.సూరిబాబు, బి.రామకృష్ణ, శ్రీనివాసరావు, మోదిన్‌వలి, అంగనవాడీలు పాల్గొన్నారు.











ప్రజాశక్తి - క్రోసూరు

సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు సందర్శించి మాట్లాడారు. ఎస్మా జీవోపై అందోళన వద్దని, అంగన్వాడీలను తీసేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, గతంలో ఇలాంటి పద్ధతే ఆలంబించిన తమిళనాడులోని జయలలిత ప్రభుత్వం భంగపడిందని గుర్తు చేశారు. అంగన్వాడీలకు అన్ని ప్రజా సంఘాలు అండగా ఉన్నాయని చెప్పారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సమ్మె శిబిరంలో రిలేదీక్షలు చేపట్టారు. యూనియన్ ప్రాజెక్ట అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే హజ్ర, డి.శాంతమణి దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. దీక్షలో కవిత, రమణ, నాగలక్ష్మి, సుజాత, సరస్వతి, వెంకటరమణ, నాగమణి, వాణి, అరుణ, శివకుమారి, స్వప్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భారీ ప్రదర్శన, ధర్నా



కలెక్టరేట్ వద్ద డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ప్రజాశక్తి- నరసరావుపేట

తమ సమస్యల పరిష్కారం కోసం 14 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు సోమవారం భారీ ప్రదర్శన, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లాలోని పలు మున్సిపాల్టీల నుండి జిల్లా కేంద్రంలోని శిబిరానికి తరలివచ్చిన కార్మికులు అక్కడి నుండి కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకుని రోడ్డుపై బైటాయించారు. ధర్నా అనంతరం డిఆర్ఒ కె.వినాయకం వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిస్క్ మరియు హెల్త్ అలవెన్స్ తదితర డిమాండ్లు, కలెక్టర్ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు చెప్పులు లాంటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు, కార్యదర్శి సిలార్ మసూద్, ఎ.సాల్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యల పరిష్కారాన్ని విస్మరించి బెదిరింపులకు పాల్పడటం, పోటీ కార్మికులతో పని చేయించడం తగదన్నారు. ప్రజారోగ్య కోసం కష్టపడి పనిచేస్తున్న కార్మికుల పొట్టకొట్టొద్దని కోరారు. ధర్నాకు బీఎస్పీ నాయకులు బి.బాబురావు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సుందరయ్య, కృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, డి.యోహాను, టి.మల్లయ్య మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి - మాచర్ల

సమ్మె శిబిరాన్ని ఎస్‌టియు నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. రాష్ట్ర నాయకులు కె.కిషోర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల శ్రమను వెలకట్టలేమన్నారు. నాయకులు గంగాధర్, జాన్‌డేవిడ్, జెఎసి కన్వీనర్ పి.అబ్రహాంలింకన్, ఎ.జ్ఞానమ్మ, అన్నమ్మ, పి.ప్రకాష్, ఎం.కన్నయ్య, ఎ.లక్ష్మయ్య, సంతోషమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో మున్సిపల్ కార్మికులు రాస్తారోకో చేశారు.





ప్రధాన వీధుల్లో భిక్షాటన చేశారు. ఎఐటియుసి ఏరియా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఎస్.అబ్రహం రాజు, పి.ఏసు, ఆర్.యేసుపాదం, కె.కోటేశ్వరావు, ఎం.మంగయ్య, ఎస్.జాను, బి.నాగరాణి, కె.రాణి, వి.యెహోషువ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్ వద్ద సమ్మె శిబిరాన్ని సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు సందర్శించి మాట్లాడారు.

బెదిరింపులకు భయపడేది లేదు : అంగన్వాడీలు


తాడేపల్లిలో

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాంతంలో అన్నీ ట్రేడ్ యూనియన్లు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపాయి. సోమవారం అంగన్‌వాడీ సమ్మె శిబిరం సమీపంలో వివిధ యూనియన్ల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. శాంతియుతంతగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ఇటువంటి బెదిరింపులకు అంగన్‌వాడీలు బెదిరిపోరని హెచ్చరించారు. అధికారం లేని నాడు ఒక మాట ఉన్న నాడు ఒక మాట చెప్పడాన్ని ఖండించారు. బెదిరింపులకు అంగన్‌వాడీలు బెదిరిపోరని, ప్రజల మద్దతుతో పాటు వైసిపి, బిజెపి మినహా అన్ని యూనియన్లు సమ్మెకు మద్దతుగా నిలబడ్డాయని చెప్పారు. ఈ సమావేశానికి అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, ఐద్వా, కౌలురైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎఐటియుసి నాయకులు కెటివి ప్రసాద్, శ్రీనివాసరావు, రాము, ఎం.చెన్నయ్య, పి.గిరిజ, డి.శ్రీనివాసకుమారి, పల్లె కృష్ణ, ఎన్.దుర్గారావు, టి.వెంకటయ్య పాల్గొన్నారు. దీక్షల్లో పి.ఫాతిమ, తబిత, సుజాత, కిరణ్మయి, మాణిక్యమ్మ, మధు, లక్ష్మీరమణ, శ్రీదేవి, మాధురి, అరుణ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

కాకుమాను మండల అంగన్వాడి హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వాసవి . శశికళ పత్తిపాడు ప్రాజెక్టు సిఐటియు అధ్యక్షులు ప్రేమలత ఆధ్వర్యంలో నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. పెదనందిపాడు లో అంగన్వాడీలు సంఘ అధ్యక్ష కార్యదర్శులు శివ పార్వతి శ్రీదేవి ఆధ్వర్యంలో జీవో 2 ప్రతులను దగ్ధం చేశారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఫిరంగిపురం అంగన్వాడీల సమ్మె శిబిరంలో వినూతంగా కుర్చీలు తిరగవేసి నెత్తిన పెట్టుకుని అంగన్వాడీలు నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - చేబ్రోలు: చేబ్రోలు సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ సందర్శించి ప్రసంగించారు. అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ప్రభుత్వం యొక్క నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు.సమస్యలు పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను నడిరోడ్డు మీద వదిలేయడం సరైనది కాదని అన్నారు. అంగన్వాడీలపై బెదిరింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా పొన్నూరు బార అసోసియేషన్ నాయకులు బాజీ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం గుంటూరు నగర కార్యదర్శి కళ్యాణి మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు.

ప్రజాశక్తి - కొల్లిపర : కొల్లిపరలో సమ్మె శిబిరం నుండి పుర వీధులో అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవో కాపీలను దహనం చేశారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : తుళ్లూరు బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మె శిబిరంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడారు.


చేబ్రోలులో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ


దుగ్గిరాలలో


పెదకాకానిలో


పెదనందిపాడులో


ఫిరంగిపురంలో


తాడికొండలో


తుళ్లూరులో


తెనాలిలో


కొల్లిపరలో


మేడికొండూరులో మద్దతు తెలుపుతున్న పుతుంబాక భారతి

బెదిరింపులకు తలోగ్గేది లేదని,సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష,స్వర్ణ లత,కార్యదర్శి కరిమూన్,రజనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు ప్రధాన సెంటర్లో జరుగుతున్న అంగనవాడి వర్కర్స్ రిలే నిరాహార దీక్షలకు సత్తనపల్లి మాజీ ఎమ్మెల్యే పూతుంబాక భారతి మద్దతు తెలిపి ప్రసంగించారు. న్యాయమైన అంగన్వాడీల డిమాండ్‌లు సాధించుకునే వరకూ పోరాడాలని చెప్పారు. కార్యక్రమంలో కౌలురై సంఘ నాయకులు బొట్ల రామకృష్ణ, ,ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, సిఐటియు నాయకులు బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : ఎస్మా చట్టానికి భయపడి సమ్మె విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. ప్రభుత్వం డెడ్లైన్ ఇచ్చి ఎస్మా చట్టం ప్రయోగించిన ఏ చట్టం ప్రయోగించిన కనీస వేతనం పొందే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు వెంకటేశ్వరమ్మ సిహెచ్ నాగమణి జి ధనలక్ష్మి ఏ నిర్మల శివపార్వతి కే సుజాత కొండమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. స్థానిక విఎస్ఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మెలో సిఐటియు, సిపిఎం నాయకులు పాల్గొని తమ మద్దతును తెలిపారు. ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తమపై ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధమని స్టేషన్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్మా జీవో కాపిని తగలపెట్టారు. మానవహారంగా ఏర్పడి నినా దాలు ఇచ్చారు ఎస్మాని వెనక్కి తీసుకోవాలని, నిర్బంధ చర్యలు మానుకోవాలని, కనీస వేతనం అమలు చేయాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, నినాదాలు చేశారు. కార్యక్రమంను ఉద్దేశించి అంగన్వాడీ జిల్లా ప్రెసిడెంట్ ఏవిఎన్ కుమారి మాట్లాడుతూ ఎటువంటి నిర్బంధాలు పెట్టినా భరిస్తామని అన్నిటికీ సిద్ధంగా ఉన్నామని మా బ్రతుకు దెరువు కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం తెనాలి ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్, పి.పావని, నళిని, జయలక్ష్మి, సీత, రంగ పుష్ప, కళాదరి, లావణ్య, ఎలిజబత్, రాధా కుమారి, నాగలక్ష్మి, మీనా, సుజాత, మాధవి సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ : 28 రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె కి సోమవారం ట్రేడ్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి అంగన్వాడీలు జి ఓ నం 2 ను దహనం చేసారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, జగన్, పూర్ణచంద్రరావు, గాంధీ, సుబ్బాయమ్మ, వెంకటలక్ష్మి, సరళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరింది. పెదకాకాని సెంటర్లో సమ్మె శిబిరంలో అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడిలు, హెల్పర్లు పాల్గొన్నారు.


ఎర్రబాలెంలో నిరసన


మంగళగిరిలో

ఉరి తాళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ, జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గౌతమ్ బుద్ధ రోడ్డుపై సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు మెడకు ఉరితాడు బిగించుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఏ ప్రభాకర్, జి దుర్గారావు, నందం బ్రహ్మేశ్వరావు, పి వెంకటేశ్వరరావు, బి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్


కాజలో

మంగళగిరి మండలం కాజా గ్రామంలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు కొన సాగు తున్నాయి. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు నేతలు బి. కోటేశ్వరి, మాధవ రెడ్డి, సత్యమారెడ్డి, రామయ్య, డి. శ్రీనివాసరావు, నాగేంద్ర బాబు, బుజ్జీ, వెంకట్, క్రాంతి, రమణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సమ్మెలో భాగంగా మండలంలోని ఎర్రబాలెంలో కార్మికులు సోమవారం ధర్నా చేశారు. రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసే విధంగా జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, మంత్రుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే సమ్మె ప్రారంభమై 14 రోజులు గడుస్తున్నాయని అన్నారు. సంక్రాంతి నాటికైనా పట్టణాలు మురికి కంపు లేకుండా చేసే విధంగా వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేసి మున్సిపల్ కార్మికుల సమ్మెను విరమింప చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిచో ఆందోళన ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టిబాబు ఓరామారావు టి ఆదిలక్ష్మి కే కోటేశ్వరి ఎం పార్వతి ఎన్ దివ్య సుజాత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్మాపై కార్మిక సంఘాల ఆగ్రహం

గుంటూరులో నిరసన - మంగళగిరిలో రౌండ్‌టేబుల్ సమావేశం


గుంటూరు నిరసనలో కార్మిక సంఘాల నాయకుల

ప్రజాశక్తి-గుంటూరు : అంగన్‌వాడీపై ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జిఒ 2ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.కృష్ణ, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు నారా జోషి తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం నియంతల పాలనకు నిదర్శనమన్నారు. తక్షణమే ఎస్మాను ఉపసంహరించుకోవటంతోపాటు, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిఎడల కార్మిక సంఘాల ప్రత్యక్ష పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్.కె.ఖాసింవలి, మాల్యాద్రి, గనిరాజు, శ్రీనివాస్, నికల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించటాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సోమవారం మంగళగిరి అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సి ఐ టి యు నాయకులు వి వి జవహర్లాల్ అధ్యక్షతన నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాని జయప్రదం చేయాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎస్మ ఉత్తర్వులకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. గత 28 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వం ఆకస్మాత్తుగా ఎస్మా ప్రయోగించడం అంటే కార్మిక పోరాటాలను నీరు కార్చేందుకే అన్నారు. అంగన్వాడీలను కార్మికులుగా గాని, ఉద్యోగులుగా గాని గుర్తించని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అత్యవసర సర్వీసులోకి చేర్చడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. బాలకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు పి నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కే వెంకటేశ్వరరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జి దుర్గారావు, చేనేత కాంగ్రెస్ నాయకులు ఆర్ పూర్ణచంద్రరావు, టిడిపి కార్మిక సంఘాల నాయకులు జి దుర్గారావు, వాకా మాధవరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరిలో రౌండడ్ టేబుల్ సమావేశం

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



బహుమతులు పొందిన వారితో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు







ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సంక్రాంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తుమ్మలచెరువు జెడ్పి హైస్కూల్లో ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా తమ ప్రతిభను చూపించాలని అన్నారు. సంక్రాంతి సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతిని రషిత-నందిని, రెండవ బహుమతి కవిత - నాగలక్ష్మి, మూడో బహుమతి నాగలాస్య - కవిత, నాలుగో బహుమతి హారిక - కవిత, ఐదవ బహుమతి కుమారి - జయలక్ష్మి సాధించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులతోపాటు ఎస్ఎఫ్ఐ నాయకులు రోహిత్, పుష్పరాజు, బ్రహ్మారెడ్డి, మహేష్, ధనుష్, యాసిన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ఆగబావి బజారులో ఉన్న గీతమ్స్ గ్లోబల్ మైండ్స్ నందు సోమవారం సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేసి చిన్నారులకు సామూహిక భోగిపళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలకు ముగ్గుల పోటీలను, బాలురకు పతంగుల పోటీలను నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించగా హరిదాసు వేషధారణ అలరించింది. పాఠశాల ప్రాంగణమంతా పండగ వాతావరణాన్ని తలపించారు. చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పండగ విశేషాలను హెచ్ఎం ఎన్.సూర్యనారాయణ వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని అగ్నిగుండాల ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు కోలాహలంగా నిర్వహించారు. హెచ్ఎం జి.ప్రతాప్ పర్యవేక్షణలో విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు వేయడం తోపాటు రంగవల్లులతో తీర్చిదిద్దారు. హరిదాసు వేషధారణ, కోలాటాలతో నృత్య ప్రదర్శనతో సందడి చేశ్శారు. విద్యార్థులను భోగి పళ్లతో ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ఉపాధ్యాయులు జి.రామారావు, టి.నాయక్, సుభాని, శైలజ, తులసి, రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెం జెడ్పి పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, భోగి మంటలు, హరిదాసుల వేషాలు, కోడి పందేలు, గాలి పటాలు ఎగురవేయటం ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్ఎం కెవి రామిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ మీరావలి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఏపీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



రివర్స్ టెండర్ పేరుతో పోలవరం ప్రాజెక్టును జగన్మోహన్‌రెడ్డి సర్వనాశనం చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. సత్తెనపల్లి రఘురాం నగర్‌ని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులు, కౌలురైతుల ఆత్మహత్యల్లో జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించిచారని, రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండో స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యలో రాష్ట్రం మూడో స్థాంలోను నిలిపారని, రైతులు చేసిన అప్పుల్లో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను మార్చే పనిమీద వున్న జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సాగునీరు అందించే ఆలోచన చేయటం లేదని, తుపాను వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గోదావరి -పెన్నా అనుసంధానం ప్రాజెక్టును నీరుగార్చారని, ప్రాజెక్టు నిర్మాణం కోసం కొనుగోలు చేసిన రూ.కోట్లు విలువైన పరికరాలు తుప్పు పడుతున్నాయని విమర్శించారు. మద్యం, ఇసుక ద్వారా అక్రమంగా దోచుకున్న సంపదను రైతులు, కౌలు రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు బి.ఆదినారయణ, బి.వెంకటస్వామి పాల్గొన్నారు.

డిజిటల్ విద్యను బోధించండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యా శాఖాధికారి కె.లక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. స్మార్ట్ టీవీలు ఉపయోగించి డిజిటల్ రూపంలో విద్యా బోధన చేయాలని సూచించారు. రాగిజావ, చిక్కి, గుడ్డును విద్యార్థులందరికీ తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సుధ, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎ.నీలిమ టి.కుమారి పాల్గొన్నారు.

శనగలో తుప్పు తెగులును నివారించాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

శనగ పైరుకు తుప్పు తెగులు ఆశిస్తోందని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని డాట్ సెంటర్ నరసరావుపేట శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్.వరప్రసాదరావు, డాక్టర్ రమేష్ సూచించారు. మండలంలోని ఇరుకుపాలెంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో రైతులకు శనగ, మిర్చి పంటల్లో సస్య రక్షణపై సోమవారం అవగాహన కల్పించారు. శనగ పంటకు తుప్పు ఆశించే పరిస్థితులు ఉన్నాయని, ఆకులపై తుప్పురంగు మచ్చలు రైతులు గమనిస్తే లీటరుకు 2 మిల్లీ లీటర్ల హెక్సాకొనజోల్ వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని అన్నారు. ఈ దశలో రబ్బరు పురుగు ఆశిస్తే ఎకరాకు ఫేమ్ 40 మిల్లీ లీటలర్లు లేదా ప్రాక్లెయిమ్ 80 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. మిర్చిని ఆశించే నల్ల తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ ఎకరాకు 400 మిల్లీ లీటర్లు లేదా స్పైనోసరోతుం 400 మిల్లీ లీటర్లు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. మిరపలో వైరస్ తెగుళ్లను నివారణకు తెగులును వ్యాప్తి చేసే తెల్లదోమ, తామర పురుగులను నివారించుకోవాలని అన్నారు. వీటి నివారణకు థయోమిథాక్సిన్ 40 మిల్లీలీటర్లు లేదా ఎసిటాప్రిడ్ 40 గ్రాములు పిచికారీ చేసుకోవాలని వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - ఈపూరు



అవినీతికి తావు లేకుండా ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని చిట్టాపురంలో రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ ఆరోగ్య కేంద్రం, పాఠశాల ప్రహరీలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దోచుకునేందుకు భవిష్యత్తు ప్రణాళికలు రచిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం నూతనంగా పింఛను మంజూరైన వారికి నగదును అందజేశారు. పంచాయతీ రాజ్ డిఇ కోటేశ్వరరావు, ఎంపిడిఒ ఎవి.రంగనాయకులు, మండల వ్యవసాయాధికారి రామారావు, ఎఇ శ్రీలత, వైసిపి మండల కన్వీనర్ కె.దేవరాజు, ఎస్.బుచ్చయ్య, వెంకట హనుమయ్య, రామారావు, వెంకట్రావు, వెంకటపతి, పంచాయతీ కార్యదర్శి హైమావతి పాల్గొన్నారు.

టిడిపి-జనసేన కూటమికి విజయం ఖాయం : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడిపి - జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 13, 14, 17, 18 వార్డుల్లో సోమవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలో కరపత్రాలు పంపిణీ చేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నిరుద్యోగంలో రాష్టం 24వ స్థానంలో ఉందని సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని విద్యాకేంద్రంలో టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు, మహిళల ఇన్విటేషన్ టోర్నమెంట్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ, నరేంద్రకుమార్ కలిసి సోమవారం ప్రారంభించారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు పేరుతో లాటరీ టికెట్లు విక్రయిస్తూ రూ.కోట్లు దోచుకుంటున్నారని, వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని అధికార పార్టీకి చెందిన వారిపై ఆరోపణలు గుప్పించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా గంజాయి పట్టుబడ్డా దాని మూలాలు ఆంధ్రాలో వున్నాయని, యువతను, విద్యార్థులను మత్తు పదార్థాలకు బానిసల్ని చేసేందుకు గంజాయిని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన అంతమోదించేందుకు యువత నడుంబిగించాలని పిలిపించారు. ఈ సందర్భ:గా కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి వై.రామస్వామి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.వెంకట అప్పారావు, సిపిఐ నాయకులు ఎన్.వేణుగోపాల్, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు టి.జయప్రకాష్ నారాయణ, పారిశ్రామికవేత్త, ప్రోగ్రాం కన్వీనర్ దరువూరి నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట



క్రికెట్ ఆడుతున్న పత్తిపాటి పుల్లారావు

రాష్ట్రంలో క్రీడా సౌకర్యాలను గత నాలుగున్నరేళ్లుగా గాలికొదిలేసి అస్తవ్యస్తం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో దొంగాట ఆడుతున్నారని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. స్థానిక గణపవరం రాజీవ్ గాంధీ కాలనిలో ఆర్‌జిసి బాయ్స్ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఒక్క స్టేడియమైనా నిర్మించారా? అని ప్రశ్నింశియారు. ప్రతిఒక్కరి దైనందిన జీవితంలో క్రీడలు, వ్యాయామం భాగం కా వాలని, అయితే జగన్ పాలనలో క్రీడా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. గతంలో టిడిపి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి మినీ స్టేడియం మంజూరు చేసి రూ.2 కోట్ల చొప్పున కేటాయించించిందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, టిడిపి నాయకులు ఇనగంటి జగదీష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో ఈవీఎంలపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలోనీ జడ్పీ హైస్కూల్ వద్ద ఓటర్లకు నోడల్ అధికారి ఎ శ్రీనివాసరావు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టార్ ఆఫీసర్ సిహెచ్ అవినాష్, విఆర్ఒ ఆశా, వైసిపి నాయకులు గొడవర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మన్నెం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

విచ్చలవిడిగా పట్టణంలో తిరుగుతున్న కుక్కలు, ఆవులు వలన ప్రజలకు ఇబ్బంది కలిగించడాన్ని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పి ప్రసాద్, జె శ్రీనివాసరావు, టి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. అనం తరం డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.

రేపటి నుండి మండలస్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - దుగ్గిరాల : 10వ తేదీ నుండి ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటలు పోటీలు ప్రారంభం అవుతాయని ఎంపీడీవో డి వీరయ్య తెలిపారు. మండలంలోని 17 సచివాలయాల నుండి 170 టీములు అర్హత పొందాయని, వీరిని దుగ్గిరాల బాలుర హై స్కూల్, డిగ్రీ కళాశాల ఈమని రేవేంద్రపాడు హైస్కూల్లో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆటలు జరిగే సమయం ఆయా గ్రామాల సచివాలయాలకు తెలియజేస్తామని తెలిపారు. విజయవాడలోని సహజ మైదానంలో ఈనెల 19న నిర్వహించే బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జన్ భాగీ ధర కార్యక్రమము ను పురస్కరించుకొని ఏడో తేదీ నుండి 11వ తేదీ వరకు గ్రామ సచివాలయాలు మరియు పాఠశాలలో కూడా ప్రజా ప్రతినిధుల సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్లు, ఆటోలను అనుమతించాలి

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గాలిగోపురం వైపు నుండి కార్లు, ఆటోలు రాకపోకలు సాగించేలా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసిపి మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ గంజి చిరంజీవి ఆలయ ఈవో రామకోటిరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ఆలయ పరిసరాల్లో వారు పర్యటించారు. ఆలయం నలు దిక్కులా ఏర్పాటు చేసిన గడ్డర్లను తొలగించాలని తెలిపారు. గాలిగోపుర భద్రతకు ఏ విధమైన ముప్పు లేకుండా ఉండేలా వాహనాలను అనుమతిం చాలని ఆలయం చుట్టూ మాడ వీధుల అభివృద్ధిలో భాగంగా సగభాగం బారికేడ్లు ఏర్పాటు చేసి మిగిలిన రహదారి సగ భాగంలో వాహనాలను అనుమతించాలని వారు సూచించారు. నగరపాలక సంస్థ అధికారులకు లెటర్ రాస్తానని ఈవో రామకోటి రెడ్డి తెలిపారు. కార్లు, ఆటోల రాకపోకులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్త భూమి హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి తెనాలి



నిరసన దీక్షలో న్యాయవాదులు

ప్రజల ఆస్తులకు రక్షణ లేని భూమి హక్కు చట్టాన్ని తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మందలపు వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను వ్యతిరేకిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం 12వ రోజుకు చేరాయి. న్యాయవాదుల నిరసనకు బిజెపి నాయకులు పి రామకృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇప్పటివరకు భూ సంబంధిత వివాదాలు కోర్టులలోనే పరిష్కరించుకునే వారని, కొత్తగా ప్రభుత్వం తెచ్చిన యాక్ట్, చట్టంతో రెవెన్యూ అధికారుల పరిధిలోని ట్రిబ్యునల్ లో భూ వివాదాలు పరిష్కరించుకోవాలని, న్యాయ సూత్రాలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల విచక్షణ మీద ఆధారపడిన ట్రిబ్యునల్ తీర్పుతో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తక్షణమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆలపాటి ప్రజా పాదయాత్ర



పాదయాత్రలో ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పాదయాత్ర సోమవారం ప్రారంభమైంది. సంగం జాగర్లమూడిలో మొదలైన పాదయాత్ర చావావారిపాలెం మీదుగా అంగలకుదురు వరకు సాగింది. పార్టీ వర్గాలతో చేస్తున్న ఆలపాటి ప్రజాయాత్రలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సంఘీభావం తెలిపారు. ఆనందబాబు మాట్లాడుతూ ప్రజా పాదయాత్ర పేరుతో రాజేంద్రప్రసాద్ సుదీర్ఘ పాదయాత్ర చేపట్టడం హర్షణీయమన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం అనే రెండుకళ్ళతో ముందుకు తీసుకువెళ్ళారని గుర్తుచేశారు. టిడిపి హయాంలో 5 వేల 6 వందలు కిలోమీటర్ల రోడ్లువేసి అభివద్ధి చేశామన్నారు. ఇప్పటి ప్రభుత్వం కొత్తగారోడ్లు వేసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. దళితులను అడ్డంపెట్టుకుని వారికి రావాల్సిన నిధులను గోల్ మాల్ చేశారన్నారు. టిడిపి జనసేన పొత్తులో అధికారంలోకి వస్తే జగన్ కి ప్రతిపక్ష హోదాకూడా దక్కదన్నారు. కార్యక్రమంలో సూర్యదేవర వెంకటరావు, కనగాల నాగభూషణం, ఊసరపు రాజ్యలక్ష్మి, పిల్లి మణిక్యరావు, అడుసుమల్లి వేంకటేశ్వరరావు, దేసు యుగంధర్, ఈదర వెంకట పూర్ణచంద్, పి త్రిమూర్తులు దివి అనిత, కొండ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మారెడ్డి కిరణ్ రూ.15 వేలు వితరణ

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామానికి చెందిన జమ్మలమడుగు చెన్నమ్మ (65) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతి వార్త తెలుసుకున్న టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రూ.15వేలు చెన్నమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండిమెడ రమేష్ బాబు, చిగురుపాటి సుబ్బారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి :మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు చెందిన నిరుపేద మహిళలకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కే స్వాతి, ఎం సత్య నారాయణ, టి కిరణ్, వెంకటేశ్వరరావు, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఉచితంగా 60 కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీ శక్తి ద్వారా దుగ్గిరాల మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 38వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 60 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి జానకి దేవి, రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత పాల్గొన్నారు.

13 వరకు పాలిటెక్నిక్ అధ్యాపకులకు శిక్షణ

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధే లక్ష్యంగా వివిధ సంస్కరణలు చేపట్టినట్లు రాష్ట్ర సాంకేతిక విద్య శాఖ కమిషనర్ సి నాగరాణి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ వివిధ రకాల మౌలిక సదుపాయాలను మెరుగు పర్చడమే కాకుండా లెక్చరర్లకు సాంకేతిక పరమైన అంశాల్లో సమగ్ర శిక్షణ అందిస్తున్నామన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం ఉదయం పాలిటెక్నిక్ లెక్చరర్ల శిక్షణా తరగతులను కమిషనర్ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో లెక్చరర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో చదివే విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న మేధా శక్తిని వెలికి తీయాల్సిన బాధ్యత లెక్చరర్లదే అన్నారు. ఈ ఆరు రోజుల శిక్షణా తరగతులు బోధనా పటిమను మరింత మెరుగు పర్చేందుకు దోహదపడతాయన్నారు. తరగతుల నిర్వహణకు అవసరమైన వసతి సదుపాయాలను ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా మాట్లాడుతూ టీచర్లు, విద్యార్థుల నడుమ సరైన అవగాహన ఉండాలనీ, సాంకేతిక పరమైన అన్ని విషయాల్లోనూ పాలిటెక్నిక్ లెక్చరర్లు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంచాలనీ, వారిలో ఉన్న శక్తి సామర్థ్యాలకు పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ పరంగా అవసరమైన సహకారాన్ని అందించేందుకు ఎస్ఆర్ఎం వర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల నుంచి 128 మంది లెక్చరర్లు శిక్షణ హాజరయ్యారనీ, ఈ నెల 13 వరకూ ఈ శిక్షణ ఉంటుందని, శిక్షణలో భాగంగా ప్రతి రోజూ గంట పాటు యోగా తరగతులు ఏర్పాటు చేశామని డీడీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ నాగరాణి టెక్నికల్ ఎడ్యుకేషన్కు సంబంధించిన సావనీర్ ఃను వైస్ ఛాన్సలర్ మనోజ్ కుమార్, నాగేందర్‌లకు అంద జేశారు. కార్యక్రమ ంలో చెన్నైకి చెందిన ఎన్ఐటీటీటీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్రరావు, సంయుక్త సంచాలకులు వీ పద్మారావు, డీడీ ఎంఏవీ రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సి నాగరాణి

కెఎల్ వర్సిటీకి కాలిఫోర్నియా స్టేట్ వర్సిటీ సహకారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :అమెరికాలోని కాలి ఫోర్నియా స్టేట్ యూనివర్శిటీ మేనేజ్ మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సోలొమన్ డార్విన్ సోమవారం తన ప్రతినిధుల బృందంతో వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీని సందర్శి ంచారు. అంతర్జాతీయ సంబం ధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు బృందాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ కాలిఫోర్నియా స్టేట్ యూని వర్శిటీకు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీల మధ్య కొనసాగుతున్న వివిధ విద్యా, పరిశోధన కార్యకలాపాల గురించి కాలిఫోర్నియా స్టేట్ యూనివర్శిటీ ప్రతినిధులు తమతో చర్చించినట్లు తెలిపారు. గతంలో ప్రవేశ పెట్టిన స్మార్ట్ విలేజ్ కార్యక్రమాన్ని కాలిఫోర్నియా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సోలొమన్ డార్విన్ ప్రశంశించారని అన్నారు. డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహరాజుతో కలిసి ఇన్నోవేషన్ రంగంలో రెండు యూనివర్శిటీల మధ్య సహకారం గురించి చర్చలు జరిపించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల, అధ్యాపకుల మార్పిడిలో సహకారాన్ని మరింత పెంచాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ సోలొమన్ డార్విన్‌ను విసి డాక్టర్.జి. పార్థసారథివర్మ, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబులు ఘనంగా సత్కరిం చారు. సమా వేశంలో ప్రో-వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బా రావు, త ది త ౦ ు ల ు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ డాక్టర్ సోలొమన్ దార్విన్‌ను సత్కరిస్తున్న విసి డాక్టర్.జి. పార్థసారథివర్మ



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కేదార్‌నాథ్

నేడు, రేపు విజయవాడలో ధర్నాను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కొల్లిపర :ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని పిఆర్‌సి, డీఏలు, పిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ తదితర ఆర్థిక బకాయిల సాధన కోసం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట ధర్నా జయప్రదం చేయాలని నాయకులు పిలుపిచ్చారు. యుటిఎఫ్ జిల్లా, మండల కార్యదర్శి కేదార్‌నాథ్, మృత్యుంజయరావు కోరారు. సోమవారం మండలంలోని యుటిఎఫ్ కార్యాల యంలో మీడియాతో మాట్లాడారు. నిరవధికంగా 36గంటలు నిర్వహించే ధర్నాలో మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



సంపుటి ఆవిష్కరణలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు తదితరులు

సూక్తి పద్య సుధ సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

నిజజీవితంలో ఉపయోగించే సూక్తులకు పద్య రూపమే 'సూక్తి పద్య సుధ' పద్య సంపుటి అని విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత తెలుగు విభాగాధిపతి డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. స్థానిక చెంచుపేట రావి టవర్స్ లో పిన్నక ధనలక్ష్మి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త పిన్నక నాగేశ్వరరావు రచించిన 'సూక్తి పద్య సుధ' పద్య సంపుటిని సోమవారం సాంబశివరావు ఆవిష్కరించారు. దూరదర్శన్ విశ్రాంత సంచాలకులు డాక్టర్ యార్లగడ్డ శైలజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ కతిని చెందు వాడు మతుడు కాడు అని నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ నిత్యం వాడుకలో ఉపయోగించే సూక్తులను పద్య రూపంగా మార్చటం అభినందనీయమన్నారు. సభలో డాక్టర్ యార్లగడ్డ శైలజ, పిన్నక నాగేశ్వరరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు ప్రసంగించారు. తొలుత ధనలక్ష్మి చిత్రపటానికి వారంతా నివాళులర్పించారు కార్యక్రమంలో ప్రముఖ యాంకర్ యార్లగడ్డ శరదతి, పి. శివ లలితాజ్యోతి, శ్రీనివాసరావు, రమేష్ బాబు, చందన, జి సుబ్బారావు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సంబరాల్లో పాల్గున్న పాఠశాల సిబ్బంది

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక అంగలకుదురు విశ్వ వేద పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు, బొమ్మలకొలువులతో సర్వాంగ సుందరంగా పాఠశాల అవరణను తీర్చిదిద్దారు. విద్యార్థుల నడుమ భోగిమంటలు వేసి ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు, అకడమిక్ ఇంఛార్జి, అవనిగడ్డ భ్రమరాంబ పర్యవేక్షణలో జరిగిన సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గున్నారు.

కెఎల్‌పి స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు


కోలాటం ఆడుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాలను పచ్చని తోరణాలు, ముగ్గులు, పతంగులు, బొమ్మల కొలువులతో అలంకరించారు.. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. ప్రిన్సిపాల్ వై.రథిని చౌదరి, ఏఓ కె.వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులకు భోగిపళ్ల పోశారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు.

అక్షయ విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు



ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండల కేంద్రంలోని అక్షయ విద్యాలయంలో సోమవారం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భోగి పళ్ల, హరిదాసులు, ముగ్గులు, గొబ్బెమ్మలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంకాలజిస్ట్ డాక్టర పవన్ రాఘవరెడ్డి, మలినేని లక్ష్మయ్య కాలేజి డీన్ పోపూరి రమేష్‌బాబు, తిరుమల కాలేజి ప్రిన్సిపాల్ వెంకట నాగేశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ సోమేశ్వరి, రఘుబాబు, అక్షయ విద్యాలయం చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి, సెక్రెటరీ అండ్ ప్రిన్సిపాల్ వెలగ శ్రీవల్లి ప్రసంగించారు.

సుమేధా హైస్కూల్లో ...


చిన్నారులకు భోగిపళ్ళు పోస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్లో సోమవారం సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. భోగిమంటలు, రంగవల్లులు, బొమ్మల కొలువు, చిన్నారుల సాంప్రదాయ వస్త్రధారణ, భోగిపళ్ల వేడుకలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి ప్రసంగించారు.



పురస్కారం అందుకున్న అధ్యాపకుల్ని అభినందిస్తున్న కాలేజి సెక్రెటరీ, తదితరులు

ఆర్‌విఆర్‌కు రీసెర్చ్ డెవలప్‌మెంట్‌లో పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు : తమ కళాశాల ఆవిష్కరణలకు ఎఐసిటిఈ నుండి పురస్కారం లభించటం గర్వకారణమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, ఇన్నోవేషన్ సెల్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఎఐసిటిఇ సంయుక్త ఆధ్వర్యంలో కె.ఎల్.యూనివర్సిటీలో జరిగిన ఇన్నోవేటివ్ భారత్-ఐఐసి రీజనల్ మీట్-2023లో ఆర్‌విఆర్ బృందం ప్రదర్శించిన నానో ఫైబ్రోస్ డ్రెసింగ్‌కు ప్రథమ బహుమతి లభించింది. భారత ప్రభుత్వ ఎంఓఈఎస్ ఇన్నోవేషన్ సెల్ అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ దీపన్‌సాహు, ఎఐసిటిఈ జ్యూరీ మెంబర్లు చేతుల మీదుగా కళాశాల బృందం ప్రశంసాపత్రాన్ని అందుకుంది. బహుమతి అందుకున్న డాక్టర్ కె.శోభ, డాక్టర్ ఎ.రత్నకుమారి, డాక్టర్ డి.ప్రదీప్‌ను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తదితరులు అభినందించారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధులు


రత్తయ్యతో చర్చిస్తున్న జపాన్ ఎంబసి ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు : వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీని సోమవారం న్యూఢిల్లీలోని ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులు సందర్శించారు. ఎంబసి ప్రతినిధులైన కౌన్సిలర్ కెంటారో ఒరిటా, సెకండ్ సెక్రటరీ రైతా సైటో, అడ్మినిస్ట్రేటివ్ అటాచీరికుతో ఐటోలకు విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణం ఘన స్వాగతం పలికారు.ఇక్కడి విద్యార్థులు నేర్చుకోవటానికి జపనీస్ లాంగ్వేజ్ సెంటర్‌ను విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని వీసీ జపాన్ ప్రతినిధులను కోరారు.అంతేకాకుండా స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్, అకడమిక్, పరిశోధన, కన్సల్టన్సీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్స్‌ను అభివద్ధి చేసుకోవడానికి అవగాహన ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.కౌన్సిలర్ కెంటారో ఒరిటా మాట్లాడుతూ రాబోయే కాలంలో ఇండియా-జపాన్ దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సరికొత్త టెక్నాలజీ, ఇండస్ట్రీ, అకడమియా ప్రోగ్రామ్స్‌ను రూపొందిచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గుంటూరు రీజియన్‌లోని ప్రజలకు ఉపయోగపడేలా జపనీస్ లాంగ్వేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి సానుకూలంగా స్పందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సమ్మెకు మద్దతు తెలిపిన సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్


గుంటూరులో మద్దతు తెలిపి మాట్లాడుతున్న పాశం రామారావు


నరసరావుపేటలో సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

ప్రజాశక్తి-గుంటూరు : విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలనే డిమాండ్‌తో గత 20 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని పాశం రామారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ సందర్శించి మద్దతు తెలిపారు. రామారావు మాట్లాడుతూ విద్యా శాఖలో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేస్తూ, ముఖ్యపాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మాట తప్పను, మడమ తప్పను అన్న జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు, ఇతర కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హామీలు అమలు చేయకుండా మోసం చేశారన్నారు.ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించాలని, ఈలోగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షులు బి లక్ష్మణ రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, అబ్దుల్ రెహమాన్,కోశాధికారి యం.గంగయ్య, కె.కిరణ్ కుమార్ మాట్లాడారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : తమ న్యాయమైన మరియు ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల సాధన కోసం నిరవధిక సమ్మె చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు ఒంటరిగా భావించకుండా ధైర్యంగా పోరాటం చేయాలని సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. స్థానిక ఏంజెల్ టాకీస్ ధర్నా చౌక్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు ఏపి సమగ్ర శిక్ష కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 20 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ చట్టబద్ధంగా నెల రోజులకు ముందే ప్రభుత్వానికి సమగ్ర శిక్ష అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చి సమ్మె చేస్తున్నారని నెలరోజుల సమయంలో రాష్ట్ర అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతోనే రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్ష కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ పార్ట్ టైం తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు సమ్మె చేస్తున్నారన్నారు. ప్రధానంగా ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు, గ్రాట్యుటీ, మినిమం టైమ్ స్కేల్ తదితర డిమాండ్లపై నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చేంతవరకు సమ్మె కొనసాగించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అయిన ఉపాధి హామీ, వెలుగు, మెప్మా విభాగాలకు హెచ్ఆర్ పాలసీ అమలు జరుగుతుందని అదే కేంద్ర ప్రభుత్వ పథకమైన సమగ్ర శిక్ష పథకంలో పనిచేసే ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని విమర్శించారు. ఉద్యోగులు ఐక్యంగా పోరాడి డిమాండ్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం రొంపిచర్ల మండల శాఖ కార్యదర్శి కామినేని రామారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మళ్ళీ ఎన్నికలు వస్తున్నా అమలు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బండారు పల్లి నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. ఉద్యోగులు అంజిరెడ్డి, పి సాంబశివరావు, పి రామకృష్ణ, జి లాజర్, వెంకట్, శ్రీకాంత్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 236 అర్జీలు



ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రానికి వచ్చి స్పందనలో అందించిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీకుమారి , కె.స్వాతి ప్రజల నుండి 236 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పీడీ హౌసింగ్ వేణుగోపాల్ , డియం అండ్ హెచ్ డాక్టర్ విజయలక్ష్మి , ఎస్.ఈ పంచాయితీ రాజ్ గుర్రం బ్రహ్మయ్య తదితరులు అర్జీలు స్వీకరించారు.

ఇన్నర్ రింగురోడ్డు బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

ప్రత్యా మ్నాయం చూప కుండా ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వటం సరికాదని, తమకు ప్రత్యామ్నాం చూపాలని స్థానిక అడవి తక్కెళ్లపాడు, మిషన్‌ఫారం వాసులు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు.ఇన్నర్ రింగు రోడ్డు 3వ దశలో ఆర్టీఒ ఆఫీసు వద్ద నుండి పేరేచర్ల వరకూ నిర్మించనున్న రోడ్డుకు ప్రభావితం అయ్యే ఇళ్లకు గతంలో దామరపల్లి, పేరేచర్లలో ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. అయితే ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారని, కానీ ఇంత వరకూ ఇళ్లు పూర్తి కాలేదని, కొందరికి పట్టాలు మాత్రమే ఇచ్చారని స్థలాలు చూపలేదన్నారు. శనివారం అర్థంతరంగా అధికారులు వారు వారం రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసులు అంటిస్తున్నారన్నారు. ఇప్పటికిప్పుడు ఎక్కడిక వెళ్లాలని ప్రశ్నించారు. తమకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ఖాళీ చేస్తామని చెప్పారు. అర్జీ ఇచ్చిన వారిలో గంగారాం, స్వర్ణ, మిషన్ పారం ప్రజలు ఉన్నారు.



జిఎంసి స్పందనకు 41 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు

స్పందనలో ప్రజల నుండి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, అర్జీలు రీఓపెన్ అయితే విభాగాదిపతే నేరుగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 41 ఫిర్యాదులు అందాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 12, ఇంజినీరింగ్ విభాగం 10, రెవెన్యూ విభాగం 7, ప్రజారోగ్య విభాగం 6, ఉపా సెల్ విభాగం 4, అకౌంట్స్ విభాగం 2 ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.లక్ష్మి శివజ్యోతి, ఎస్ఈ (ఎఫ్ఎసి) సుందర్రామిరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సుందరయ్య నగర్‌లో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో సిమెంటు రోడ్లు వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సుందరయ్య నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జిఎంసి స్పందనలో అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి ఆది నికల్సన్ మాట్లాడుతూ గతంలో పలు మార్లు విన్నవించగా 1, 2 లైన్లలో సిమెంటు రోడ్లు వేశారని, 3వ లైనులో మధ్యలోనే ఆపేశారన్నారు. కావున 3వ లైను, 4వ లైను, 6-10వ లైన్లలో సిమెంట్ రోడ్లు వేయాలని కోరారు. అలాగే 10వ లైన్‌లో సైడు కాలువ నిర్మించాలన్నారు. కాలనీ రోడ్డు నుండి అడవి తక్కెళ్లపాడు మెయిన్ రోడ్డుకు అనుసంధానం చేసే దగ్గర సిమెంట్ రోడ్డు వేయకుండా, కంకర వేసి ఒదిలేశారని, దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, కావున రోడ్లు అనుసంధానం అయ్యే చోట కూడా సిమెంట్ రోడ్డు వేయాలని కోరారు. సుందరయ్య నగర్ లో 19 కరెంటు పోల్స్‌కు వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అభివద్ధి కమిటీ సభ్యులు షేక్.ఖాశింషహీద్, ఎండి ముస్తాక్, షేక్.మస్తాన్‌వలీ, ఎస్.పద్మనాభుడు, జి.లూథర్ పాల్ పాల్గొన్నారు.